నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, శనివారం 12 ఏప్రిల్ 2025 | PEDDAPALLI


## టీచర్‌కు రెండేళ్ల జైలు

భూమి అమ్మకం పేరిట మోసం చేసిన ఫలితం

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 11 : భూమి అమ్ముతానని నమ్మించి మోసం చేసిన కేసులో నిందితుడు ప్రభుత్వ టీచర్ మేకల బాపునకు రెండేళ్ల జైలు, ₹10 వేల జరిమాన విధిస్తూ కరీంనగర్ సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం హేమలత శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రేకుర్తిలోని సూర్యనగర్‌కు చెందిన మేకల బాపు కరీంనగర్ మండలం చేగుర్తిలో ఉన్న తన మూడెకరాల 14 గుంటలు అమ్ముతానని బొమ్మకల్‌కు చెందిన జక్కుల రేణుకతో ₹10 లక్షలకు 2014 ఏప్రిల్ 15న విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా రేణుక వద్ద రెండు దఫాలుగా ₹7 లక్షలు తీసుకున్నాడు. మిగతా నగదు రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాలని తెలిపి రిజిస్ట్రేషన్ చేయకుండా ముఖం చాటేశాడు. మోసాన్ని గ్రహించిన రేణుక.. మేకల బాపుపై కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు 2017 ఫిబ్రవరి 25న అతడిపై చీటింగ్ కేసు నమోదు చేయగా, అప్పటి ఎస్‌ఐ ఎల్ శ్రీను దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను పీసీ పరమేశ్వర్ కోర్టులో ప్రవేశ పెట్టగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ రంజిత్ విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి జైలు, జరిమాన విధించారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## ఐదువేల మందితో కదలుదాం

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురిలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం

వెల్గటూర్/ధర్మపురి రూరల్, ఏప్రిల్ 11: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి 20మంది చొప్పున ధర్మపురి నియోజకవర్గం నుంచి 5వేల మందితో వెళ్లి విజయవంతం చేద్దామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ధర్మపురిలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, కొప్పుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ మాత్రమే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత, దొంగ హామీలను అనతి కాలంలోనే అన్నివర్గాల ప్రజలకు తెలుసుకున్నారన్నారు. భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఈ నెల 27న ఉదయం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆ తర్వాత ఎల్కతుర్తి సభకు బయలుదేరాలన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం 20ఏండ్లు వెనక్కి పోయిందన్నారు. ఇప్పుడున్న పరిస్థితులు రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న రోజులను గుర్తు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు, ఏఎంసీ మాజీ చైర్మన్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, ఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్ అక్బర్ హుస్సేన్, నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్

# సభకు లక్షన్నర మంది!

### కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి తరలిస్తాం

- భారీ జనసమీకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం
- ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు బుక్ చేశాం
- తెలంగాణ తెచ్చి, అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు
- సభకు స్వచ్ఛందంగా తరలివస్తరు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి లక్షన్నర మందిని తరలిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. సభకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే సభ కోసం భారీ జనసమీకరణ చేస్తున్నామని, అనుగుణంగా ప్రణాళికలు వేసుకొని 10 రోజులుగా ఆచరణలో పెడుతున్నామన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు 400 ఆర్టీసీ బస్సులు, 200 ప్రైవేట్ స్కూల్ బస్సులు బుక్ చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రైవేట్ బస్సులు మొత్తం బుక్ చేస్తున్నామని చెప్పారు. ఇవి కూడా సరిపోవడం లేదని భావించి మహారాష్ట్రకు సంబంధించిన బస్సులు కూడా బుక్ చేశామన్నారు. కార్లు, ఇతర వాహనాలు ఏవి అందుబాటులో ఉంటే వాటిని బుక్ చేస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా అంటే తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎంతో అభిమానమని, కేసీఆర్ లేకుంటే బీఆర్ఎస్ ఏర్పాటయ్యేది కాదని, బీఆర్ఎస్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు తమ ఆస్తిగా భావిస్తారని, రాష్ట్రాన్ని తెచ్చిన. అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని తెలిపారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే కేటీఆర్ ఒకసారి కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సన్నాహక సభను నిర్వహించారని, మరోసారి ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించేందుకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కరీంనగర్ వస్తున్నారని తెలిపారు. చింతకుంటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు పొన్నం అనిల్ కుమార్, అక్బర్ హుస్సేన్, ఏనుగు రవీందర్‌రెడ్డి, మైకెల్ శ్రీనివాస్, గందె మాధవి మహేశ్, నాగరాజు, రెడ్డవేని మధు, గడ్డం నాగరాజు, తిరుపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### పొన్నం.. మానేరు రివర్ ఫ్రంట్ వద్దా..?

*మానేరు రివర్ ఫ్రంట్ పనులు ఎందుకు నిలిచిపోయాయో మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పాలి. హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్ నిర్మించేందుకు ఆరాట పడుతున్నరు? దీనికి అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ లేదు. నిధులు కేటాయించలేదు. భూ సేకరణ జరగలేదు. అయినా దానికోసం హైదరాబాద్‌లోని 150 మంది కార్పొరేటర్లను తీసుకుని సబర్మతికి సందర్శనకు వెళ్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది. మా ప్రభుత్వ హయాంలోనే మానేరు రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభమయ్యాయి. టూరిజం నుంచి ₹100 కోట్లు, ఇరిగేషన్ శాఖ నుంచి ₹540 కోట్లు వచ్చిన జీవో ఉన్నది. అయినా ఈ పనులు ఎందుకు ఆగిపోయాయి? దీనికి మంత్రిగా పొన్నం సమాధానం చెప్పాలి. కాళేశ్వరం ప్రాజెక్టును ఆపినట్టే దీనిని కూడా ఆపేస్తారా..? ఒక పక్క తీగల వంతెన చీకటిగా మారిపోయింది. కనీసం లైట్లు వేసే పరిస్థితి లేదు. వచ్చే జూన్‌లోగా పనులు పూర్తి చేసి రివర్ ఫ్రంట్‌లో నీరు నిలపాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నం.*

**- గంగుల కమలాకర్**

### భారీ జనసమీకరణ చేస్తున్నాం



బీఆర్ఎస్ రజతోత్సవ సభ చారిత్రాత్మకమైనది. ఈ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భారీ జన సమీకరణ చేస్తున్నాం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ప్రజల మద్దతుతోనే అధికారంలోకి వస్తాయి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన చేయాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అతి తక్కువ కాలంలోనే ప్రజల మద్దతు కోల్పోయింది. ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ సాధించి, పదేళ్లలో ఊహించని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రజల మన్ననలు అందుకుంటున్నది. ఈ నేపథ్యంలో రజతోత్సవ సభకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తున్నది. 1,200 ఎకరాల్లో సభ నిర్వహిస్తున్నాం. ఇక్కడి రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇవ్వడమే కాకుండా వారి సొంత ఖర్చులతోనే చదును చేయిస్తున్నారు. మా పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. ప్రజల మద్దతుతో రజతోత్సవ సభ దిగ్విజయం అవుతుందనే నమ్మకం మాకు ఉన్నది. సభ నేపథ్యంలో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారిపై కొన్ని సమస్యలు ఉన్నాయి. వీటిని కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని చెప్పారు. కరీంనగర్ నుంచి వెళ్లే వాహనాలు అల్గునూర్ తిమ్మాపూర్, నుస్తులాపూర్, కొత్తపల్లి, చిగురుమామిడి, హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

**- బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ**



మంథని: పూలే విగ్రహానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

## ఆదర్శం.. జ్యోతిబా పూలే

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపు

కరీంనగర్, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన పోరాటం చేసి.. అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. సమసమాజ నిర్మాణంలో మహాత్మా జ్యోతిబాపూలే –సావిత్రీబాయి పూలే దంపతులు దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. ప్రతిఒక్కరూ వారి ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. పూలే జయంతి సందర్భంగా మంథనిలో మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మహనీయుల దీక్ష తీసుకున్నారు.

## నేడు కరీంనగర్‌కు కేటీఆర్



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న వినోద్‌కుమార్, గంగుల కమలాకర్, నాయకులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కరీంనగర్ రానున్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జన సమీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించనున్నారు. కరీంనగర్ శివారులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహిస్తున్నారు. కాగా, పార్టీ జిల్లా కార్యాలయానికి కేటీఆర్ మొదటిసారి విచ్చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, తదితర నాయకులు పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

### రామన్న చొరవతోనే

# టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీ

- 2022లోనే సిరిసిల్లలో పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన
- మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలు
- వర్క్ టూ ఓనర్ పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి
- బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి
- కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నేతన్న చౌరస్తాలో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: పది వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అప్పారెల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టారని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతోనే ఇప్పుడు సిరిసిల్లలో టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీ అందుబాటులోకి వచ్చిందని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి కొనియాడారు. మహిళలకు ఉపాధి చూపాలనే లక్ష్యంతోనే పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాజన్న శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నేతన్న చౌరస్తాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, 2022లోనే అప్పారెల్ పార్క్‌లో దాదాపు ఏడెకరాల స్థలం కేటాయించడంతోపాటు శంకుస్థాపన చేశారని చెప్పారు. గతంలోనే గోకుల్‌దాస్ కంపెనీ ఏర్పాటు ద్వారా 1,500మంది మహిళలకు ఉపాధి కల్పించారని కొనియాడారు. బెంగళూర్, తదితర రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలనుకున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీని కేటీఆర్ చొరవ తీసుకుని సిరిసిల్లకు తీసుకొచ్చారని వివరించారు. గోకుల్‌దాస్, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీ ద్వారా దాదాపు 5వేల మందికి ఉపాధి లభించిందన్నారు. 'వర్కర్ టూ ఓనర్' పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ₹380కోట్లతో షెడ్లు నిర్మించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీ ఏర్పాటులో కేటీఆర్ ఫొటో ఏర్పాటు చేయకుండా ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ పేర్లను ఫ్లెక్సీల నుంచి తొలగించగలరేమో గానీ.. ప్రజల గుండెల్లో వారి స్థానాన్ని చెరిపివేయలేరని స్పష్టం చేశారు. అప్పారెల్ పార్క్ అందుబాటులోకి తెచ్చిందే కేటీఆర్ అనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ మాట్లాడుతూ, బృహత్తరమైన సంకల్పంతో గోకుల్‌దాస్, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీలను సిరిసిల్లకు కేటీఆర్ తీసుకొచ్చారని కొనియాడారు. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో కేటీఆర్ ఫొటో పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి, నాయకులు మ్యాన రవి, సత్తార్, దిడ్డి రాజు, లింగంపల్లి సత్యనారాయణ, గుండ్లపల్లి పూర్ణచందర్, పోచవేని ఎల్లయ్యయాదవ్, రాజిరెడ్డి, సుంకపాక మనోజ్‌కుమార్, రిక్కుమల్లె సంపత్, వెంకన్న, జక్కుల యాదగిరి, పోరండ్ల రమేశ్, సామల శ్రీనివాస్, మునీర్, బూర తిరుపతి, కాసర్ల పవన్ పాల్గొన్నారు.



పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, తదితరులు

## పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 11 : శాతవాహన విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలను శుక్రవారం పరిపాలనా భవనంలో ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ నాలుగు ఫ్యాకల్టీ విభాగాలలో ఫలితాలను విడుదల చేశామని, దీంతో విశ్వవిద్యాలయంలో పరిశోధన కూడా మరింత ముందుకు వెళ్తుందని, ఇది విశ్వవిద్యాలయ అభివృద్ధికి చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య సుజాత, ఓఎస్డీ టూ వీసీ డాక్టర్ హరికాంత్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్రారూల్ బఖి, ఆచార్య వరప్రసాద్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.




కోరుట్ల: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కోరుట్ల/ ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం కోరుట్లతోపాటు ఎల్లారెడ్డిపేటలో మసీదుల వద్ద చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. రామగుండంలో శాంతియుతంగా ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతున్నదని విమర్శించారు. వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకొనే వరకు శాంతియుతంగా నిరసన చేపడుతామని తెలిపారు.



మాల విరమణ మండపంలో దీక్షాపరులు

## జై బోలో హనుమాన్ కీ

నేడు హనుమాన్ చిన్న జయంతి

'జై శ్రీరాం' 'జై బోలో రామభక్త హనుమాన్ కీ..' అంటూ భక్తుల స్మరణలతో కొండగట్టు దేవస్థానం మార్మోగుతున్నది. దీక్షాదారులతో గుట్ట కాషాయరంగును పులుముకొన్నది. శనివారం హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా శుక్రవారం నుంచే ఉత్సవాలు ప్రారంభం కాగా, రాత్రి నుంచే దీక్షాపరులు పోటెత్తారు. సూర్యోదయానికల్లా స్వామి సన్నిధిలో దీక్షలను విరమించి, మొక్కులు చెల్లించుకొని తిరుగు పయనమవనున్నారు.

**- మల్యాల, ఏప్రిల్ 11**

## మొరాయిస్తున్న రాజీవ్ యువ వికాసం సైట్

మంథని, ఏప్రిల్ 11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన వెబ్ సైట్ మొరాయిస్తున్నది. గత నెలాఖరులో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 4వ తేదీన ముగిసి పోవాల్సి ఉండగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల లేక పోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. దీంతో ఈ నెల 14 వరకు పొడిగించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు, ఔత్సాహికులంతా ఆన్‌లైన్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. మరో నాలుగు రోజుల్లో దరఖాస్తులకు గడువు ముగిసి పోతున్న నేపథ్యంలో యువత దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సెంటర్లకు కొండంత ఆశతో వస్తున్నా వెబ్ సైట్ పని చేయక పోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సెంటర్ల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఒక్కోసారి సైట్ పని చేసినప్పటికీ సమాచారమంతా నింపుతూ చివరి పేజీకి వెళ్లిన తర్వాత పేజీ పని చేయడం లేదంటూ కన్పిస్తోంది. దీంతో చేసేది ఏమీ లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సైట్ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.